# హస్త సాముద్రికం

ఎడారిలాంటి జీవితంలో ఒయాసిస్సు లాంటిది స్నేహం.

కొంతమంది జీవన వనంలోకి ఆమనిలా ప్రవేశించి ప్రతి పూవునీ, తీవెనీ ముట్టుకుని, ముద్దాడి జీవితాన్ని రాగరంజితం చేస్తారు. అటువంటి వ్యక్తులే మూర్తీ, మానస.

ఇద్దరితో నా పరిచయం చాలా తమాషాగా జరిగింది.

బ్యాంక్ ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూ కెళ్ళాను. ఆ రోజు ఉదయం జరిగే ఇంటర్వ్యూల్లో నేనే చివరివాడిని. కొంతమంది యింకా పుస్తకాల్ని తిరగేస్తున్నారు. మరికొంతమంది ఇంటర్వ్యూ అయి బైటికొచ్చిన వ్యక్తిని చుట్టుముట్టి ప్రశ్నలతో ముంచెత్తుతున్నారు.

నాకేమీ తోచటం లేదు. కొద్దిగా నెర్వస్‌గా కూడా ఉంది. వాతావరణాన్ని తేలికపర్చుకోవటం చాలా అవసరం అన్పించింది. నా ఎదురుగా కూచున్న అమ్మాయివైపు ఓ క్షణం చూసి నా చేతులు రెండూ చాపి రేఖలు నిశితంగా చూసుకుంటూ అన్నాను.

"నా రేఖల్ని బట్టి ఈ ఉద్యోగం తప్పకుండా నాకు రావాలండీ"

ఆ అమ్మాయి కుతూహలంగా నా వైపు చూసింది.

"మీకు పామిస్ట్రీ వచ్చా"

"అది నా హాబీ. సరదాగా నేర్చుకున్నాను. ఏ ఉద్యోగమూ రాకపోతే ఓ చెట్టుకింద కూచుని రోజుకో పదిచేతులు పట్టుకున్నా జీవితం హాయిగా గడిచిపోతుందని"

తను నవ్వింది - బుగ్గలు అందంగా సొట్టలు పడేట్లు.

"మరి నాకు చెప్పండి" ఎడం చేయి ముందుకు చాపింది.

"ఆడవాళ్లకయితే ఎడంచేయి, మగవాళ్లకు కుడిచేయి చూడటం శాస్త్ర సమ్మతం కాదండి... పామిస్ట్రీలో గొప్ప పేరు గడించిన 'కీరో' ప్రకారం ఎవరికయినా రెండు చేతులూ

చూడాలి... రెండు చేతుల్లోని రేఖల తులనాత్మక పరిశీలన, అరచేతుల్లోని రకాలూ, గోళ్ళ నిర్మాణం, అరచేయి రంగూ, వీటన్నిటిని పరిగణించాకే ఓ నిర్ణయానికి రావాలి...."

కొలనులోని గులాబీ రంగునీళ్ళు ఓసారి ఒయ్యారంగా సుడి తిరిగి - మధ్యలో అందమైన సుడిగుండాన్ని సృష్టించినట్లు ఆమె బుగ్గల మధ్య నొక్కులు పడ్డాయి.

"అయితే మీకు సరదాగా కాకుండా సీరియస్‌గానే ఈ హాబీ అలవడిందన్నమాట" నవ్వుతూ మరో చేయి కూడా ముందుకు చాపింది.

తన చేతుల్ని నా చేతుల్లోకి తీసుకున్నాను. మొదట్లో పామిస్ట్రీని నేర్చుకుంది ఇందుకే - అమ్మాయిల చేతుల్ని శ్రమలేకుండా ముట్టుకోవచ్చు. ఎవరూ అభ్యంతర పెట్టరు. ఆ తర్వాత నిజమైన ఉత్సుకత, ఆసక్తికొద్దీ అధ్యయనం చేశాను.

"మీకీ ఉద్యోగం ఖాయం. అదృష్టరేఖ చాలామందంగా, స్పష్టంగా మౌంట్ ఆఫ్ శాటర్న్ వరకూ పోతోంది. మీరు యిరవై దాటాక ఏది చేపట్టినా విజయం సాధిస్తారు. చూశారా సక్సెస్ లైన్ ఎంత నీట్‌గా మౌంట్ ఆఫ్ సన్ వరకూ ప్రాకుతుందో..ఇపుడు మీవయసెంత?"

యిబ్బందిగా కదిలిందా అమ్మాయి. సన్నగా నవ్వుతూ "యిరవై" అంది. చెంపలమీద డింపుల్స్ ఓక్షణం కన్పించి మాయమయ్యాయి.

"కాబట్టి మీకీ ఉద్యోగం రావటం అనేది అనివార్యం"

"ట్రాష్. ఇంటర్వ్యూకి అటెండ్ అవ్వకుండా వెళ్ళిపోయినా వస్తుందా"

"మనం కొన్ని పరిస్థితులకు తలవొంచి పనులు చేస్తాం. మన బాధ్యతలు, మనమీద ఆధారపడిన వ్యక్తులు, అవసరాలు, ఆశలు-ఇవన్నీ నిగళాల్లా మనల్ని కట్టిపడేస్తాయి. దాన్నే 'విధి' అనుకోవచ్చు"

"ఈ విధీ, అదృష్టమూ, దేవుడూ, దెయ్యమూ అంతా బంకం - ఉత్త ట్రాష్. సైంటిఫిక్ రీజనింగ్‌లేని దేన్నీ నేను నమ్మను"

అలా స్థిరంగా అంటున్నప్పుడు ఆమె కళ్ళు మందారాల్లా మారాయి.

"కీరో పామిస్ట్రీకి శాస్త్రపరమైన వివరణ యివ్వటం జరిగింది. స్త్రీ గర్భంలో పిండం

పిడికిళ్ళు ముడుచుకుని ఉండటం వలన రేఖలు ఏర్పడతాయనుకుంటే కొన్ని విషయాల్లో అయినా రేఖల్లో సామీప్యం రావాలి... కానీ ఏ రెండు వ్యక్తుల రేఖలూ ఒకేలా వుండవు. చివరికి శారీరకంగా సామీప్యం వున్న కవలల్లో కూడా రేఖలు ఒకేలా వుండవు. పోనీండి మనం ఓ బెట్ పెట్టుకుందాం. పెళ్ళికి, పిల్లలకూ సంబంధించిన రేఖలు చదవటంలో నేను పర్ఫెక్ట్ అనుకుంటూ ఉంటాను. మీ చేతి రేఖల్ని బట్టి మరో ఐదారు సంవత్సరాల వరకూ మీకు పెళ్ళికాదు"

పెళ్ళివిషయం ఎత్తగానే ఆ అమ్మాయి చెంపలు కొద్దిగా ఎరుపెక్కి గాఢమైన రంగుల్ని అందంగా పడిన గుంటల్లో దాచేశాయి.

"సారీ - మీ పామిస్ట్రీ తప్పని చెప్పడానికి ఇదే పెద్ద ఉదాహరణ ఓ వ్యక్తి నన్ను పెళ్ళి చేసుకోడానికి సిద్ధంగా వున్నాడు. ఎటోచ్చి ఈ జాబ్ విషయం తెలిశాక పెద్దవాళ్ళకు చెప్పాలని వేచివున్నాం. అంటే మరో రెణ్ణెల్లల్లో నా పెళ్ళి తప్పకుండా జరుగుతుంది".

నా పామిస్ట్రీ తప్పని చెప్పినా - ఆమె నమ్మకం, ఆత్మవిశ్వాసం నన్ను ముగ్ధుణ్ణి చేశాయి. అందుకే మనస్ఫూర్తిగా అభినందనలు చెప్పాను.

ఆ అమ్మాయికి పిలుపొచ్చింది.

తను వెళ్ళాక పరిసరాల్ని చూస్తూ కూర్చున్నాను. ఓ వ్యక్తి చాలా సేపటినుంచీ నావైపే చూస్తున్నట్లనిపించింది.

నేనూ చూశానతని వైపు. పలకరింపుగా నవ్వాడతను. లేచివచ్చి నా పక్కన కూర్చున్నాడు.

"నెక్స్ట్ క్యాండిడేట్‌ని నేనేనండీ-నాకీ ఉద్యోగం వస్తుందంటారా" చేతులు ముందుకు చాపాడు.

నవ్వొచ్చింది నాకు. ఫ్యూచర్‌ని తెల్సుకోవాలనే మనుషుల్లోని బలహీనత ఆదిమయుగం నించీ యిప్పటివరకూ మారలేదు. దీన్ని జీవనాధారంగా చేసుకుని బ్రతికే వాళ్ళెందరో...

"మీకు తప్పకుండా వస్తుంది" అన్నాను.

"అదేవిటండీ చేయి చూడకుండానే చెప్పేస్తున్నారు. ఆ అమ్మాయికి నమ్మకం లేకున్నా

రేఖల్ని పరిశీలించి చెప్పారు. నాకేమో... నేను బాగా నమ్ముతానండీ."

"దీని కోసం రేఖల్ని చూడనవసరం లేదు. ఉద్యోగం వస్తుందన్న నమ్మకం, తప్పకుండా విజయం సాధించాలన్న పట్టుదల, సిన్సియర్‌గా చేసే కృషి, కొంత దైవబలం - యివుంటే చాలు, ఎవరికయినా తప్పకుండా ఉద్యోగం వస్తుంది"

"థాంక్స్ అండీ. నా పేరు మూర్తి" అన్నాడు ఆనందంగా.. అపుడే అతనికి పిలుపొచ్చింది.

ఆ అమ్మాయి బైటికొచ్చింది.

"బాగానే చేశాను. మీ ప్రాఫసీ నిజమయ్యేట్లుంది" నవ్వింది తను. ఆ నవ్వు లోని మాధుర్యాన్నంతా బుగ్గల్లోని సొట్టల్లోంచి విశ్వం అంతా వెదజల్లుతున్నట్లు- ఆమె మానస.

★★★

మూర్తికీ, నాకూ హైద్రాబాద్‌లోనే పోస్టింగ్స్ వచ్చాయి. వేరే వేరే బ్రాంచీల్లో.

మూర్తీ నేనూ ఒకే రూంలో ఉండేవాళ్ళం. మృదు స్వభావి, నెమ్మదస్తుడు, స్నేహశీలి అయిన మూర్తికీ నాకూ చాలా త్వరగా సాన్నిహిత్యం కుదిరింది.

సాయంత్రాలు మూర్తితో కలిసి పార్కులూ, సినిమాలూ, ట్యాంక్ బండ్‌లూ తెగ తిరిగే వాడిని.... కమ్మటి కబుర్లు, తీయటి ఆలోచనలు, వింతవింత కలలు, కొత్త కొత్త అనుభూతులూ- క్షణాలు స్నేహ మాధుర్యం గ్రోలి ఝుమ్మని ఎగిరిపోయేవి.

కానీ ఆ ఆనందం ఆర్నెల్లకంటే ఎక్కువ దొరకలేదు నాకు. కారణం మూర్తి పెళ్ళి.... చెల్లెళ్ళ కవసరమైన కట్నం కోసం యింట్లోనివారంతా అతన్ని తొందరపెట్టారు.

పెళ్ళిచూపులకు నేనూ వెళ్ళాను మూర్తితో కలిసి.

మూర్తి కోరుకునే లక్షణాలన్నీ స్త్రీ ఆకృతి దాల్చి మా ఎదురుగా ముగ్ధలా ముడుచుకుని కూచున్నట్లు అన్పించింది నాకు. అక్కడ కూచున్నంతసేపూ సహజమైన కుతూహలం కొద్దయినా తలయెత్తి మూర్తివైపు చూడలేదు తను.

మూర్తి పేరడిగితే తలవొంచుకునే చెప్పింది.

"దేవసేన" అని. ఆ గొంతులోని నమ్రత, లాలిత్యం, సౌకుమార్యం అద్భుతంగా అన్పించాయి.

దేవసేన ఎక్కువగా చదువుకోలేదు. మూర్తికి కూడా చదువుకున్న ఆడవాళ్ళన్నా, ఉద్యోగస్తులన్నా అంతగా యిష్టం లేదు.

పెళ్ళయి - మూర్తి వేరుగా కాపురం పెట్టాక చాలాసార్లు వెళ్ళాను వాళ్ళింటికి.

దేవసేన ఎప్పుడూ ఎదురు పడేదికాదు. ఎదురుపడినా తలవొంచుకుని, కొంగునిండా కప్పుకుని వెళ్ళిపోయేది. నేనున్నప్పుడు - మూర్తితో మాట్లాడాల్సి వచ్చినా, తలుపుచాటున నిలబడి చాలా మంద్రమైన స్వరంతో పిలిచేది.

మూర్తి కోరుకున్నది అటువంటి భార్యనే. అందుకే కాఫీలు యివ్వాలన్నా భార్యని తెమ్మని పిలిచేవాడు కాదు. తనే వంటగదిలోకి వెళ్ళి తెచ్చేవాడు.

నేనెప్పుడూ దేవసేనని పూర్తిగా చూడలేదు. చూసే అవకాశం ఎప్పుడూ కల్పించబడలేదు. దేవసేన గొంతు, కాలిగజ్జెల శబ్దం, గాజుల అలజడి, మేలి ముసుగు అపుడపుడూ ఓక్షణంపాటు కన్పించే జడా, చెంపలూ, నాసికాగ్రం, కళ్ళ చివర్లూ.. అంతే.

★★★

పెళ్ళయిన మూడు సంవత్సరాల తర్వాత ఓ రోజు మూర్తి నా రూంకొచ్చాడు. భార్యని క్షణం వదిలి ఉండలేని మూర్తి పనిగట్టుకుని నా రూంకి రావటం కొద్దిగా ఆశ్చర్యాన్ని కలిగించింది.

ఎంతసేపయినా అసలు విషయం చెప్పటంలేదని నిర్ధారించుకున్నాక నేనే చొరవ తీసుకుని అడిగాను విషయం ఏమిటని.

"నా జీవితంలో పిల్లలు ఉన్నారంటావా" అని అడిగాడు. ముఖం నిండా విషాదం ఉంది. చాలా ఉదాసీనంగా ఉన్నాడు.

"డాక్టర్సని కన్సల్ట్ చేయలేకపోయావా"

"అవన్నీ అయ్యాయి. వాళ్ళు చెప్పినవన్నీ ఆచరించాను.. ఫలితం లేదు. భగవంతుని వరప్రసాదంలాంటి వాళ్ళు పిల్లలు. అందుకే ఇక దైవ శక్తిని నమ్ముకోవాలనుకుంటున్నాను. నీవు పిల్లలగురించి చాలా పర్ఫెక్ట్‌గా చెప్తావు కదా. నా చేతిలో ఆ భాగ్యం ఉందో లేదో చెప్పు".

"పిల్లలకు సంబంధించిన రేఖలు స్త్రీల చేతుల్లోనే స్పష్టంగా ఉంటాయి" అన్నాను మూర్తివైపు సాలోచనగా చూస్తూ.

మూర్తి ఇబ్బందిగా ముఖం పెట్టాడు. నాకు తెల్సు - ఈ జన్మలో తన భార్య చేయి మరో వ్యక్తి చూడటాన్నిమూర్తి సహించలేడని... దానికి దేవసేన కూడా ససేమిరా ఒప్పుకోదు.

"కాగితం మీద ప్రింట్ తీసి తీసుకు రమ్మంటావా" అడిగాడు మూర్తి ఆశగా.

"ప్చ్ -లాభం లేదు. పిల్లలకు సంబంధించిన రేఖలు చిటికెన వేలికి కిందిభాగంలో ఉన్న వివాహరేఖని కట్ చేస్తూ చాలా చాలా సన్నగా ఉంటాయి. మామూలుగా చూసినా వాటిని గుర్తించటం కష్టం. ప్రింట్ అయితే అసలు కనబడవు" అన్నాను పెదవి విరుస్తూ.

"పోనీలే. స్పష్టంగా లేకున్నా నా చేతిలో కూడా ఉంటాయిగా - చూడు" చేతులు రెండూ ముందుకు చాపాడు మూర్తి.

మొదట చేతిని పరిశీలించాను. అరచేయి అడుగు భాగం, వ్రేళ్ళ మొదళ్ళు, వ్రేళ్ళు, గోళ్ళు అన్నీ దాదాపు స్క్వేర్ షేప్‌లో ఉన్నాయి. అతనిది యూజ్ ఫుల్ హ్యాండ్. బొటనవేలికి అడుగు భాగాన ఉబ్బెత్తుగా ఉండే మౌంట్ ఆఫ్ వీనస్‌ని పరిశీలించాను. అది అంతగా డెవలప్ కాలేదు. అంత ప్రామినెంట్‌గా కూడా లేదు. అటువంటి వాళ్ళకు పిల్లలు పుట్టే అవకాశం తక్కువ. తర్వాత మౌంట్ ఆఫ్ మెర్క్యూరీ మీద ఉన్న మేరేజ్ రేఖని చాలా జాగ్రత్తగా పరిశీలించాను. దానికి అడ్డంగా ఏ రేఖలూ కన్పించలేదు నాకు. లోపలికెళ్ళి భూతద్దం తీసుకు వచ్చి మరలా పరిశీలించాను. వుహు అపుడు కూడా నాకే రేఖలూ, కనీసం ఫీబుల్‌గా కూడా కన్పించలేదు.

"సారీ మూర్తీ" అన్నాను నిస్పృహగా.

కొద్దిసేపు మూర్తి నిశ్శబ్దంగా అలానే కూచున్నాడు. నేనూ ఏమీ మాట్లాడలేదు. హఠాత్తుగా మూర్తి లేచి ఏమీ చెప్పకుండా వెళ్ళిపోయాడు. నేనూ అతన్ని ఆపే ప్రయత్నం చేయలేదు.

యిది జరిగిన కొన్ని నెలలకే నాకు ట్రాన్స్‌ఫర్ వచ్చింది గుంటూరుకి. హైద్రాబాద్

వదిలే ముందు మూర్తికి చెబ్దామని వెళ్లాను. యింటికి తాళం ఉంది. మూర్తి భార్యతో సహా తీర్థ యాత్రల కెళ్ళాడని తెల్సింది.

గుంటూరులో మూర్తి ఆలోచనలు దాదాపు మరుగునపడ్డాయి... మానస వల్ల. ఇంటర్వ్యూ టైంలో నేనుచేయిపట్టుకుని జోస్యం చెప్పిన అమ్మాయి గుంటూరులో, నేను పనిచేసే బ్రాంచిలోనే ప్రత్యక్షమౌతుందని నేనెపుడూ వూహించలేదు. అదేమాట తనతో అంటే బుగ్గల్లో అందమైన అరకులోయ సౌందర్యాన్ని గుర్తుకుతెచ్చే సొట్టలు చూపిస్తూనవ్వింది మానస.

"చేయి చూసి భూత భవిష్యత్ వర్తమానాల్ని చెప్పగల మీకు ఈ విషయం తెలీకపోవటం వింతగానే ఉంది" అంటూ - నా పామిస్ట్రీ అంటె తనకెప్పుడూ ఎగతాళే.

"మీ శ్రీవారేం చేస్తుంటారు" అని అడిగాను.

"బహుశా శాపగ్రస్తుడై దారితెలీక నా కోసం పరితపిస్తూ వెతుక్కుంటున్నాడేమో" అంది.

"అదేమిటీ - ఎవరో ఉన్నారనీ, త్వరలో జరుగుతుందనీ చెప్పారు"

"చెప్పాన్లెండి. మీరు శాపం పెట్టారుగా - అందుకే జరగలేదు" అని నవ్వి సీరియస్‌గా మొహం పెట్టి "నన్ను ప్రేమించాడట. నా ఉద్యోగమూ, చదువూ, అందమూ నచ్చాయట. వీటికి తోడు మరో పాతికవేలు కట్నం కావాలిట. యిడియట్, నేనే వద్దన్నాను" అంది.

"యిలా అయితే పెళ్ళి కావటం కష్టమేనండీ" అన్నాను ఉడికిస్తూ.

"మీరు పెట్టిన గడువింకా కాలేదుగా, వేచి చూద్దాం. ఎవరైనా వెతుక్కుంటూ వస్తారేమో-" సమ్మోహనంగా నవ్వింది మానస.

మానస స్నేహ మాధుర్యంలో తెలీకుండానే రెండేళ్ళు గడిచిపోయాయి. నాకు ఆఫీసర్‌గా ప్రమోషన్ వచ్చింది. ప్రమోషన్ మీద విజయనగరంలో పోస్ట్ చేశారు.

విజయనగరం వెళ్ళే ముందురోజు మానస దగ్గర పెళ్ళి విషయం తీసుకు వచ్చాను. ప్రేమా - పీచూ అంటే చెంపలు వాయించే రకం అని తెల్సు కాబట్టి సూటిగా విషయం చెప్పేశాను. తను చాలా సంతోషంగా ఒప్పుకుంది.

"ఆ రోజు ఐదు సంవత్సరాలు ఆగాలని చెప్పింది ఈ దుర్బుద్ధితో అన్మాట" చిలిపిగా

చూస్తూ చెప్పింది మానస.

మానసని కూడా విజయనగరం ట్రాన్స్‌ఫర్ చేయించాను.

కొత్త జీవితం ప్రారంభించాక మానస నిగారింపైన బుగ్గల మీదపడే లోయల్లో నన్ను నేను కోల్పోయాను.

"మీకీ డింపుల్స్ అంటే అంతిష్టమా" డింపుల్స్ మీద నా పొగడ్తలు వినీ వినీ విసుగుపుట్టి అడిగిందోరోజు.

"చాలా చాలా యిష్టం" అన్నాను.

"ఈ డింపుల్స్ నాకు నాన్నగారి నుంచి సంక్రమించాయి. మా నాన్నగారి కున్న ఐదుగురు సంతానంలో కేవలం నాకూ, తమ్ముడు మోహన్‌కి మాత్రమే హెరిడిటరీగా ఈ డింపుల్స్ వచ్చాయి. నా నించి మన పిల్లలకు కూడా వస్తాయని ఆశిద్దాం. దిగులుపడకండి" అంది.

నాకూ బోల్డు కోరికగా ఉంది. కొడుకో, కూతురో పుట్టి వాళ్ళకు డింపుల్స్ వస్తే.. యిలా ఎప్పుడైనా పిల్లల గురించి ఆలోచిస్తున్నప్పుడు మూర్తి గుర్తుకు వస్తాడు. గుంటూరులో ఉన్నప్పుడు ఒకటీ అరా మూర్తి నించి ఉత్తరాలు వచ్చేవి. వాటి నిండా సంతానం లేకపోవడం గురించే బాధపడుతూ రాసేవాడు. విజయనగరం వచ్చాక - మా పెళ్ళికి రాలేకపోయినందుకు విచారిస్తూ రాసిన ఉత్తరం తప్ప మరే సమాచారమూ లేదు.

అప్పుడపుడూ మూర్తిని చూడాలని బలంగా అన్పించేది, దేవసేనని కూడా "నిత్యం లేచి పాదాభివందనం చేయతగిన అన్ని రకాల సద్గుణాలూ మూర్తీభవించిన స్త్రీ" అని అవకాశం దొరికినపుడల్లా మానసతో చెప్తుంటాను దేవసేన గురించి.

ఈ మధ్యకాలంలో ఓ సారి మాబావ మరిది మోహన్ ఏదో పనిమీద హైద్రాబాద్ వెళ్ళటం జరిగింది. వెళ్ళేప్పుడు మా మూర్తి అడ్రెస్ ఇచ్చి కల్సుకోమని చెప్పాను.

మూర్తి చాలా బాగా ఆదరించాడట. నా గురించీ, మానస గురించీ తరిచి తరిచి వివరాలడిగాడట. మోహన్ హైద్రాబాద్‌లో వున్న పక్షం రోజులూ తనింట్లోనే ఆతిథ్యమిచ్చాడట.

ఎటొచ్చీ మనిషిలో దిగులూ, ఉదాసీనత స్పష్టంగా కన్పిస్తున్నాయని మోహన్ చెప్పాడు.

ఆ తర్వాత నేను ధైర్యం చెప్తూ రెండు ఉత్తరాలు రాసినా వాటికి జవాబు రాలేదు. నాకు హైదరాబాద్ వెళ్ళటమూ కుదరలేదు.

★★★

విజయనగరంలో సెటిల్ అయిన రెండేళ్లకి అనుకోకుండా హైద్రాబాద్ వెళ్ళాల్సిన పని పడింది.

ప్రయాణం ఫిక్స్ అయిన క్షణం నించీ నాకు మూర్తి, దేవసేనల ఆలోచనలే.

హైద్రాబాద్‌లో దిగినవెంటనే మొదట మూర్తిని వెతుక్కుంటూ వెళ్ళాను ఆఫీస్‌కు. మూర్తి నన్ను చూసి కౌగిలించుకున్నంత పనిచేశాడు. మనిషి కొద్దిగా లావెక్కాడు. వయసుతోపాటు శరీరంలో నిగారింపు కూడా పెరిగిందేమో. చాలా ఆనందంగా - ఉల్లాసంగా కన్పించాడు. మోహన్ చెప్పిన లక్షణాలు మచ్చుకైనా కన్పించలేదు. మూర్తిలో మార్పొచ్చినందుకు మనస్ఫూర్తిగా సంతోషించాను.

"ఏవిటి సంగతులు - యిన్నేళ్ళ మౌనానికి ఏమిటి కారణం" అని అడిగాను చిరుకోపంగా.

"సంగతులు కాదు -విశేషాలు. యింటికి పద గొప్ప గొప్ప విశేషాలు తెలుస్తాయి' అని శెలవు పడేసి యింటికి పిల్చుకెళ్ళాడు. నాక్కూడా చాలా ఆతృతగా ఉంది దేవసేనని చూడాలని.

యింట్లో కడుగుపెట్టగానే వసారాలో ఓ ఏడాది బాబు ఆడుకుంటూ కనిపించాడు. ముద్దుగా, బొద్దుగా చాలా అందంగా ఉన్నాడు బాబు.

"వీడే గొప్ప విశేషం. నేనూ, దేవసేన చేసిన ఏ వ్రతాల, నోముల ఫలితంగానో దేవుడు మాకీ బిడ్డను ప్రసాదించాడు" అంతులేని ఆనందం ఉంది మూర్తిలో.

వెళ్ళి బాబుని ఎత్తుకున్నాను. ఆరోగ్యంగా ఉన్నాడు బాబు. నల్లటి ఉంగరాల జుట్టు, కలువరేకుల్లా కళ్ళు, చిన్ని పెదవులు, వంపుతిరిగిన గడ్డం.. ఒళ్ళో కూచోబెట్టుకున్నాను.

"నీ పామిస్ట్రీ తప్పయింది చూశావా - బాబు పుట్టకముందు పిల్లల్లేరనే బాధలో నీకు

ఉత్తరాలు రాయలేకపోయాను. వీడు పుట్టాక, నీవు నాచేయి సరిగా చూడలేదన్న కోపంతో రాయలేదు" పసిపిల్లాడిలా అలకనటిస్తూ మాట్లాడుతున్నాడు మూర్తి.

తలుపు కదిలేత్తే తలయెత్తి చూశాను. తలుపుకి ఆనుకుని నిలబడి ఉంది దేవసేన - ఎప్పటిమల్లే తల వొంచుకుని, ముసుగు నిండా కప్పుకుని..

బాబు దేవసేన వైపు చేతులు చాపి నవ్వుతున్నాడు.

ఆ. నవ్వు - యథాలాపంగా చూసిన నేను క్షణం ఆశ్చర్యపడి - మరలా చూశాను. గులాబీరేకుల్లా విరిసిన ఆ లేత బుగ్గల మధ్య నీడల్ని సృష్టిస్తూ పడిన అందమైన డింపుల్స్‌ని-

ఆశ్చర్యంనించి తేరుకుని బాబువైపు పరిశీలనగా చూశాను. ఆ జుట్టు, కళ్ళు, నుదురూ, బుగ్గలూ, సొట్టలూ.. అచ్చం అవే - నాకు సుపరిచితమైనవే.

"నువ్వారోజు నాచేయి చూసేటపుడు పొరబడ్డావేమో - సరిగా చూసివుండవు. లేదా నువ్వు చూసినపుడు లేకుండా ఆ తర్వాత కొత్తరేఖలు పుట్టాయేమో. అపుడపుడూ రేఖలు మారుతుంటాయనీ, జరగబోయే సంఘటనల్ని బట్టి కొత్తరేఖలు వస్తుంటాయనీ ఓ సారి చెప్పావుగా. ఇపుడు చూసి చెప్పు. సరిగ్గా" మూర్తి తన రెండు చేతులూ చాపి నా ఎదురుగా పెట్టాడు.

చేతులపైనించి తలుపు వేపు చూశాను.

దేవసేన కొద్దిగా యివతలికి వచ్చి నిలబడింది. కళ్ళోసారి పైకి ఎత్తి, నావైపు చూసి, మరలా తల దించుకుంది.

బాబు నవ్వుతూనే ఉన్నాడు. అనంతమైన రహస్యాల్ని యిముడ్చుకోగల లోతైన డింపుల్స్ చూపిస్తూ -

"నిజమే నేను పొరబడ్డాను" అన్నాను మూర్తితో.

దేవసేన మరోసారి తలెత్తి నా కళ్ళల్లోకి చూసి, తలదించుకుని తలుపు చాటుకి వెళ్ళిపోయింది.

● స్వాతి మాస పత్రిక ఫిబ్రవరి, 1988 ●